సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం : 21 : ఫిబ్రవరి : 2025



అక్రమాలకు అడ్డాగా గూడెం !

గత ఐదేళ్లుగా ప్రశాంతంగా ఉన్న తాడేపల్లి గూడెం పట్టణం మళ్లీ అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది.


8లో ▸



మామిడి.. తగ్గనున్న దిగుబడి

మామిడి దిగుబడి ఏటేటా తగ్గుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, పురుగుల బెడదతో దిగుబడి, ఆదాయం తగ్గుతోంది.

8లో ▸



పట్టిసంలో చురుగ్గా ఏర్పాట్లు

పట్టిసంలో ఈనెల 25 నుంచి 27 వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

8లో ▸

న్యూస్‌రీల్

బయో సెక్యూరిటీ విధానాన్ని పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర పశుసంవర్ధక శాఖ జేడీ బొంబేలే

తణుకు అర్బన్: కోళ్ల ఫారాల్లో పూర్తిస్థాయి బయోసెక్యూరిటీ విధానాన్ని పాటిస్తే బర్డ్‌ఫ్లూ వైరస్ కారణంగా కోళ్ల ఉత్పత్తులపై విధించిన నిబంధనలను త్వరగా తొలగించే పరిస్థితి ఉంటుందని కేంద్ర పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఆర్‌జీ బొంబేలే అన్నారు. గురువారం తణుకు చిట్టూరి హెరిటేజ్‌లో పౌల్ట్రీ రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్‌జోన్ ప్రాంతాన్ని గతంలో 3 కిలోమీటర్ల పరిధి నిబంధన ఉండేదని రైతుల ఇబ్బందుల దృష్ట్యా కిలోమీటరుకు తగ్గించినట్లు వివరించారు. రానున్న రోజుల్లో ఫారాల్లోని కోళ్లకు వ్యాక్సినేషన్ వేసే ప్రక్రియ చేపట్టనున్నామన్నారు. నెక్ చైర్మన్ కోమట్లపల్లి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ బర్డ్‌ఫ్లూ వైరస్ కన్నా ప్రభుత్వం విధించిన నిబంధనలపై మీడియా చేసిన ప్రచారం కారణంగా ప్రజల్లో అపోహలు పెరిగిపోయి పౌల్ట్రీ రైతులు నష్టపోయారని అన్నారు. పౌల్ట్రీ రంగం కోళ్ల ఉత్పత్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.400 కోట్లు జీఎస్టీ రూపంలో చెల్లిస్తుందని స్పష్టం చేశారు. వైరస్ కారణంగా ప్రభుత్వం విధించిన ఆంక్షలను తొలగించాలని కోరారు. అనంతరం వేల్పూరు రెడ్‌జోన్‌లోని కోళ్ల ఫారాలను, ఆ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఫొటో గ్యాలరీని కేంద్ర బృందం పరిశీలించింది. కేంద్ర ఎస్‌ఆర్‌డీడీఎల్ జేడీ డాక్టర్ రవీంద్ర హెడ్గే, ఐసీఏఆర్ సీనియర్ సైంటిస్టులు ఎండీ మద్సార్ చాంద్, డాక్టర్ మనోజ్‌కుమార్, వెటర్నరీ యూనివర్సిటీ మైక్రో బయోలజీ ప్రొఫెసర్ కేవీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ జేడీ దామోదర్ నాయుడు, జిల్లా జేడీ మురళీకృష్ణ, డీడీ వాకాని ప్రసాద్, తణుకు మండల పశు వైద్యాధికారి శంకర్ భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ)లో 3, 4 తరగతుల ఉద్యోగుల నియామకాన్ని వెంటనే చేపట్టాలని, అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలని కోరుతూ గురువారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద భోజన విరామానికి ముందు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉద్యోగుల సంఘ కార్యదర్శి సొలస సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగుల నియామకం, సంఘ గుర్తింపు కోసం మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచే బిల్లు ప్రవేశపెట్టినప్పుడు కూడా సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తోట పద్మారావు, విద్యాసాగర్, రమేష్, సాయిరాం, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఇంటి దొంగలు

సొమ్ములు బొక్కేస్తున్నారు

- రిసీప్ట్స్ హెడ్ నిధులను స్వాహా చేస్తున్న సిబ్బంది
- రాయలంలో రూ.2.33 కోట్లు కాజేసినట్టు నిర్ధారణ
- పలు పంచాయతీలపైనా ఫిర్యాదులు
- రాజకీయ ఒత్తిళ్లతో ముందుకు సాగని విచారణలు
- పారదర్శకంగా విచారిస్తే వెలుగులోకి మరిన్ని అక్రమాలు



భీమవరం రూరల్ రాయలం పంచాయతీకి షాపుల అద్దెలు, వేలం పాటలు, లెసెన్స్ ఫీజులు, ప్లాన్ అప్రూవల్స్ తదితర రూపాల్లో వచ్చిన రూ.2.33 కోట్ల ఆదాయాన్ని పంచాయతీ ట్రెజరీలోని అకౌంట్‌లో జమచేయకుండా సిబ్బంది తమ సొంతానికి వాడేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఒక కార్యదర్శి రూ.1,99,50,956, మరో కార్యదర్శి రూ.14,94,224, జూనియర్ అసిస్టెంట్ రూ.15,98,455 దుర్వినియోగం చేసినట్టు తేలింది. ఆడిట్‌లో సైతం అక్రమాలు బయటపడకుండా వీరికి కొందరు అధికారులు సహకరించినట్టు గుర్తించారు. పక్కనే ఉన్న చినఅమిరం పంచాయతీలో సైతం ఇదే తరహాలో సొమ్ములను స్వాహా చేశారు. కేవలం రెండు పంచాయతీల్లో జరిపిన విచారణలో వెలుగు చూసిన అక్రమాలివి.

సాక్షి, భీమవరం: జిల్లాలోని 20 మండలాల పరిధిలో 409 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ఇంటి పన్నులకు సంబంధించి 3,11,954 అసెస్‌మెంట్లు ఉండగా ఆస్తి పన్ను డిమాండ్ రూ.30.98 కోట్లుగా ఉంది. ఇవి కాకుండా రిసీప్ట్స్ హెడ్ కింద లైసెన్స్ ఫీజులు, ప్లాన్ అప్రూవల్స్, సాల్వెన్సీ సర్టిఫికెట్లు, సీనరేజీ, స్టాంప్ డ్యూటీ, పంచాయతీ షాపులు, ఆశీల వసూళ్లు, చేపల చెరువులు, కొబ్బరిచెట్లు, పచ్చగడ్డి తదితర వేలం పాటలు, పర్ కాపిటా గ్రాంట్ తదితర నాన్ టాక్స్ రూపంలో మరిన్ని నిధులు సమకూరుతుంటాయి. జిల్లా కేంద్రం, పట్టణ సమీప పంచాయతీలకు టాక్స్, నాన్‌టాక్స్ రూపంలో వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటుంది. ప్రజలు చెల్లించే సొమ్ములను ఎప్పటికప్పుడు సిబ్బంది ట్రెజరీలోని పంచాయతీ పీడీ అకౌంట్‌లో జమచేయాలి. అత్యవసర నిల్వగా చిన్న పంచాయతీల్లో రూ.500, పెద్ద పంచాయతీల్లో రూ.5,000 వరకు నిల్వగా ఉంచుకోవచ్చు. అదీ కూడా ఒక్కరోజు మాత్రమే ఉంచి తర్వాత ట్రెజరీలో జమచేయాలి.

దారిమళ్లుతున్న సొమ్ములు : సాధారణంగా పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధిలైట్లు తదితర పనులు చేపట్టేందుకు పంచాయతీ తీర్మానంతో అంచనాలు రూపొందించి, పనికి సంబంధించిన వివరాలను ఎంబుక్‌లో రికార్డు చేసి నిధులు డ్రా చేయాలి. అత్యవసర సమయాల్లో ఆయా పనుల నిమిత్తం ర్యాటిఫై చేయడం ద్వారా నిధులు ఖర్చుచేయవచ్చు. చాలా పంచాయతీల్లో ట్యాక్స్, నాన్ ట్యాక్స్ రూపంలో ప్రజలు చెల్లించిన సొమ్ములను వెంటనే ట్రెజరీల్లో జమచేయకుండా అత్యవసర పనుల కోసమని తమ వద్దనే ఉంచేస్తున్నారు. ఇదే అదునుగా కొందరు కార్యదర్శుల నుంచి జూనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు సిబ్బంది ప్రజల సొమ్ములను దారి మళ్లించి తమ సొంత అవసరాలకు సర్దుబాటు చేసుకుంటున్నారు. మార్చి నెలాఖరు నాటికి నూరు శాతం ఆస్తిపన్ను లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నారే తప్ప నాన్ ట్యాక్స్ పరిధిలోని రిసీప్ట్స్ హెడ్ నిధులపై అంతగా అజమాయిషీ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా మారింది. అక్రమాలు బయటపడకుండా ఆడిట్ అధికారులు సైతం పంచాయతీ సిబ్బందికి సహకరిస్తున్నట్టు విచారణల్లో బయటపడింది. రాయలం, చినఅమిరంలో అక్రమాలపై దర్యాప్తు చేయించిన కలెక్టర్ సీహెచ్ నాగరాణి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు.

విచారణలు జరిపిస్తున్నాం: డీపీఓ

పంచాయతీల్లో అవకతవకలపై డీపీఓ అరుణశ్రీని సంప్రదించగా పలు పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్టు అందిన ఫిర్యాదులపై అధికారులతో విచారణలు జరిపిస్తున్నామని చెప్పారు. త్వరలో నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

మరిన్ని పంచాయతీల్లో...

జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణానికి చేరువగా ఉన్న భీమవరం రూరల్, పాలకోడేరు, వీరవాసరం, ఉండి మండలాలు అలాగే తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం పట్టణ సమీపంలోని పలు పంచాయతీల్లో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే పది వరకు పంచాయతీలపై ఫిర్యాదులు రాగా డీఎల్‌పీఓ స్థాయి అధికారులు విచారణలు జరుపుతున్నారు. తమ పలుకుబడితో రాజకీయ నాయకుల ద్వారా పై అధికారుల ఒత్తిడి తీసుకురావడం, ప్రలోభాలకు గురిచేయడంలో కొందరు సిబ్బంది ఆరితేరినట్టు తెలుస్తోంది. పంచాయతీల్లో కేవలం ఆస్తి పన్ను వసూలు లక్ష్యానికే పరిమితం కాకుండా రిసీప్ట్స్ హెడ్ నిధులు ఎంత మేర వసూలయ్యాయి? ఎంత వరకు ట్రెజరీల్లో చెల్లింపులు చేశారనే విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తే మరిన్ని పంచాయతీల్లో అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉందని పలువురు అంటున్నారు.

వేగంగా మౌలిక వసతుల కల్పన



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశంచౌక్): ఎస్సీ బాలికల వసతి గృహంలో టాయిలెట్ల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, గడువులోపు పనులు పూర్తికాకుంటే చెల్లింపులు నిలిపివేస్తారని కలెక్టర్ చదలవాడ నాగరాణి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. పట్టణంలోని ఎస్సీ బాలికలు, ఎస్టీ బాలుర హాస్టళ్లను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రైతు బజార్ సమీపంలో ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎస్సీ కాలేజీ విద్యార్థుల వసతి గృహం, ఎస్సీ చిన్నపిల్లల వసతి గృహం, బీసీ విద్యార్థుల వసతి గృహాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. హాస్టళ్లలో వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ కేటాయించామని పనులు సకాలంలో పూర్తికావాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలపై ఆరా తీశారు. తాగునీరు, ఇన్వర్టర్ కోసం విద్యార్థులు కలెక్టర్‌ను కోరారు. అనంతరం గునుపూడి ఎస్టీ బాలుర హాస్టల్‌ను ఆమె పరిశీలించారు. భోజనం నాణ్యతపై ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, హౌసింగ్ పీడీ వై.హరిహరనాథ్, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి బి.రామాంజనేయరాజు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,800

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ స్లిప్పుల పంపిణీ
- రెండు రోజుల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల జారీ ప్రక్రియ
- ఆరు జిల్లాల్లో 440 పోలింగ్ కేంద్రాలు
- 27న పోలింగ్.. 3న కౌంటింగ్



పోస్టల్ బ్యాలెట్ పంపిణీని పరిశీలిస్తున్న జేసీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పించారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు కోసం ఫారం–12 సమర్పణకు గురువారం తుది గడువుగా విధించారు. ఈ క్రమంలో ఆరు జిల్లాల్లో కలిపి కేవలం 220 పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు మాత్రమే అందాయి. మొత్తంగా 440 పోలింగ్ కేంద్రాల్లో సుమారు పోలీస్ సిబ్బందితో సహా 2,800 మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. పోలీస్ శాఖ, ఇతర ప్రధాన విభాగాల నుంచి మరికొందరి పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తులు రావాల్సి ఉంది.

3.15 లక్షల మంది ఓటర్లు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 3,15,261 మంది ఈనెల 27న ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కూటమి పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుతో పాటు 33 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు. 25న సాయంత్రం 5 గంటలకు ప్రచార పర్వం ముగియనుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ఆఫీసర్‌తో పాటు మరో ముగ్గురు సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ ఇలా ఐదుగురు ఉద్యోగులను నియమించారు. అలాగే ప్రతి చోటా ఇద్దరు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 62, పశ్చిమగోదావరిలో 93, తూర్పుగోదావరిలో 82, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 92, కాకినాడ జిల్లాలో 96, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఎన్నికల విధుల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం రిటర్నింగ్ అధికారి, ఏలూరు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి.

40 శాతం స్లిప్పుల పంపిణీ

పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం–12 దరఖాస్తు ఇచ్చిన వారికి రెండు రోజుల్లో పోస్టల్ బ్యాలెట్‌ను ఏలూరు కలెక్టరేట్ నుంచి రిజిస్టర్ పోస్టు చేయనున్నారు. మార్చి 3న కౌంటింగ్ ప్రక్రియ జరగనున్న క్రమంలో 2న సాయంత్రం వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించే అవకాశం కల్పించారు. మరోవైపు ఆరు జిల్లాల్లో ఓటర్ల స్లిప్పుల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటివరకు 40 శాతం స్లిప్పుల పంపిణీ పూర్తయింది.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

ఏలూరు(మెట్రో): ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం పోస్టల్ బ్యాలెట్ పత్రాల పంపిణీని ఆమె పరిశీలించారు.

విధ్వంసం తప్ప.. అభివృద్ధి లేదు

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులో కేఎస్‌ఎన్ కాలనీ వద్ద శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: 'మీ పాలనలో విధ్వంసం తప్ప అభివృద్ధి లేదని మరోసారి రుజువు చేశారు..' అంటూ నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ఉద్దేశించి మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఘాటుగా వ్యాఖ్యానించారు. మండలంలోని కొండ్రుప్రోలు కేఎస్‌ఎన్ కాలనీలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ప్రాంతాన్ని గురువారం కొట్టు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో రూ.22.44 కోట్ల అంచనాతో పలు పనులకు శ్రీకారం చుడుతూ పంచాయతీరాజ్ శాఖ శిలాఫలకాన్ని నిర్మించిందని, దీనిని చూసి ఓర్వలేక కూల్చివేశారని విమర్శించారు. కూల్చివేతకు సంబంధించి ముగ్గురు, నలుగురు పేర్లు తన దృష్టికి వచ్చాయని, పంచాయతీరాజ్, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదన్నారు. అలాగే కలెక్టర్‌కు ఫోన్ చేస్తే స్పందించడం లేదని విమర్శించారు. దీనిపై కోర్టు ద్వారా సంబంధిత శాఖ అధికారులకు నోటీసులిచ్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతామన్నారు. గతంలో కూడా కేఎస్‌ఎన్ కాలనీ వాసులు ఇక్కడ ఆర్చి నిర్మిస్తే దానిని టీడీపీ హయాంలోనే కూల్చివేశారని గుర్తుచేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుని శిలాఫలకాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు.

రెడ్‌బుక్ పాలన : రాష్ట్రవ్యాప్తంగా రెడ్‌బుక్ పాలన సాగుతోందని మాజీ మంత్రి కొట్టు విమర్శించారు. గూడెం నియోజకవర్గానికి ఉపాధి హామీ నిధులు తక్కువ మంజూరయ్యాయన్నారు. మహిళలు రోడ్లపై తిరిగే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. బెల్టుషాపులు, పేకాట క్లబ్‌లు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని, 365 రోజులూ కోడిపందేలు జరుగుతున్నాయని, మద్యం షాపుల్లో నియోజకవర్గ ప్రజాప్రతినిధి కుటుంబ సభ్యులకు వాటాలు ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్‌కు ఇవేమీ పట్టడం లేదని మండిపడ్డారు. గంజాయికి తాడేపల్లిగూడెం అడ్డాగా మారిందన్నారు. బెల్టు షాపుల రద్దు ఫైల్‌పై చంద్రబాబు తొలి సంతకం చేశారని గుర్తుచేస్తూ ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంజూరైన నిధులతోనే ఇప్పటివరకు పనులు జరిగాయన్నారు. కూటమి పాలనలో ప్రభుత్వం నుంచి ఏ నిధులు తీసుకొచ్చారో చెప్పాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్‌లు, షోరూం నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, కనుపూరి ఉదయ్ భాస్కర్, గార్లపాటి వీరకుమార్, కారింకి వీర్రాజు, గంగారావు, బండి గణపతి, పాలూరి శివ పాల్గొన్నారు.

టీసీసీ పరీక్షలకు 27 మంది గైర్హాజరు

భీమవరం: స్థానిక ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం హైస్కూల్‌లో గురువారం టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలకు 27 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని డీఈఓ ఈ.నారాయణ తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలకు 112 మందికి 85 మంది అభ్యర్థులు హాజరైనట్టు చెప్పారు.

కొరుటూరులో చిరుత సంచారం



ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుత

పోలవరం రూరల్: గోదావరి నదీ పరీవాహకంలోని ఏజెన్సీ ప్రాంతంలో వన్య మృగాలు సంచరిస్తున్నాయి. పోలవరం మండలం కొరుటూరు సమీపంలో చిరుత సంచరిస్తోంది. అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో దీనిని గుర్తించారు. సాయంత్రం, రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో ఎవరూ సంచరించవద్దని అటవీ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 26 గిరిజన గ్రామాలు ఖాళీ అయ్యాయి. దీంతో జనసంచారం ఉండటం లేదు. ఎండ తీవ్రత పెరుగుతుండటంతో నీటి కోసం పలురకాల జంతువులు గోదావరి ఒడ్డుకు చేరుకుంటున్నాయి. జనసంచారం లేకపోవడంతో యథేచ్ఛగా తిరుగుతున్నాయి.

మాతృభాష..



'తెలుగు భాష తియ్యదనం.. తెలుగు భాష గొప్పతనం.. తెలుసుకున్న వాళ్లకు తెలుగే ఓ మూలధనం.. పరభాషా జ్ఞానాన్ని సంపాదించు.. కాని నీ భాషలో నువ్వు సంభాషించు..' అంటూ మాతృభాష ఔన్నత్యాన్ని ఓ సినీ కవి ఎంతో గొప్పగా అభివర్ణించారు. పాశ్చాత్య ధోరణులతో మాతృభాషను విస్మరించవద్దని భాషాభిమానులు గొంతెత్తి చాటుతున్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స, ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అంటూ ఖ్యాతి గడించిన తెలుగుపై అభిమానం యువతలో సన్నగిల్లుతోంది. కార్పొరేట్ కొలువులే లక్ష్యంగా ఆంగ్లంపై మక్కువ పెంచుకుంటూ తెలుగును విస్మరించడం తగదని భాషా నిపుణులు సూచిస్తున్నారు.

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

పలకాలి అందరి నోట


- పరభాషల కోసం యువత పాకులాట
- ఇంగ్లిష్ మోజులో తెలుగును విస్మరిస్తున్న వైనం
- మాతృభాష మాధుర్యాన్ని మరుస్తున్న నేటితరం
- తెలుగు గొప్పతనాన్ని గుర్తించాలంటున్న భాషాభిమానులు
- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మారుతున్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలు, సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, విదేశాల్లో కొలువుల కోసం ఇంగ్లిష్‌పై పట్టు తప్పనిసరిగా మారింది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నతనం నుంచే ఇంగ్లిష్‌కే పరిమితం చేస్తుండగా మాతృభాషకు దూరమవుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత తెలుగుకు దూరమవుతున్నారని భాషాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు, ఉపాధి లక్ష్యంగా ఇంగ్లిష్, హిందీ నైపుణ్యాలను పెంచుకుంటూ తెలుగును మరిచేపోయే పరిస్థితికి వస్తున్నారని ఆందోళన చెందుతున్నారు.

ఉద్యమంలా భాషా పరిరక్షణ

మాతృభాష పరిరక్షణకు జిల్లాలో ఇప్పటికే తెలుగు భాషా సంఘాలు, రచయితల సంఘాలు పూనుకున్నాయి. కరపత్రాల పంపిణీ, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, తెలుగుభాషపై పోటీలు నిర్వహణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వీటితో పాటు తెలుగు సాహిత్య కార్యక్రమాలు, అవధానాలు, పుస్తక పరిచయాలు వంటి కార్యక్రమాలను స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తూ భాషాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నాయి.


మానసిక పరిపక్వతకు..



మాతృభాషలో విద్యాబోధనతోనే విద్యార్థి మానసిక ఎదుగుదల, పరిపక్వత సాధ్యమవుతాయని పరిశోధనలు స్పష్టం చేశాయి. 26 అక్షరాల (ఇంగ్లిష్) వెంటపడుతూ 56 అక్షరాల సంపదను మనం విస్మరించడం బాధాకరం. శక్తివంతమైన భావ వ్యక్తీకరణకు ఉపయోగపడే గొప్ప భాష తెలుగు. తెలుగు భాష మాధుర్యాన్ని, గొప్పతనాన్ని భావితరాలకు అందించాలి.

–డాక్టర్ కొండా రవి, తెలుగు అధ్యాపకుడు, నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

గుర్తింపే ప్రశ్నార్థకంగా..



మాతృభాష అంటే ప్రతిఒక్కరికీ మమకారం పెరగాలి. ముఖ్యంగా తెలుగు ప్రజల్లో అదే లోపిస్తోందనిపిస్తోంది. ప్రస్తుతం తెలుగు మాట్లాడానికి కూడా సిగ్గుపడే పరిస్థితికి నేటి తరం వచ్చింది. ఇదే పరిస్థితి కొనసాగితే కొంతకాలానికి తెలుగు మాట్లాడే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. తెలుగు ప్రజల గుర్తింపే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదంలో పడతాం.

– గురు శర్మ, తెలుగు రచయిత

నండూరి.. బుచ్చిబాబు.. మరెందరో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తెలుగు భాషకు పట్టుగొమ్మ. రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో మాండలికాలు వేరుగా ఉన్నా 'పశ్చిమ' యాస ప్రత్యేకతను సంతరించుకుంది. పత్రికలు, పుస్తకాలు, నవలలు, సినిమాల్లో ఈ యాస ఎక్కువగా కనిపిస్తుంది. జిల్లాకు చెందిన పలువురు రచయితలు తమ రచనల ద్వారా ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా ఎంకి, నాయుడు బావ పాటల సృష్టికర్త నండూరి వెంకట సుబ్బారావు ఈ జిల్లాకు చెందిన వారే. ఆయనతో పాటు బుచ్చిబాబు, కావలి సోదరులు, బొడ్డు బాపిరాజు, తిరుపతి వేంకట కవులు, కొనకళ్ల వెంకటరత్నం, దేవరకొండ బాలగంగాధర్ తిలక్ వంటి రచయితలు తెలుగు భాషను శిఖరాగ్రాన నిలిపారు.

క్లుప్తంగా

ఏజెన్సీలో అందని వైద్యం



దోలీలో దేవమ్మ మృతదేహాన్ని బండారిగూడెం తరలిస్తున్న గ్రామస్తులు

కుక్కునూరు: ఏజెన్సీలో ఆదివాసీలకు వైద్యం అందని ద్రాక్షలా తయారైందని సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి విమర్శించారు. గురువారం కుక్కునూరు మండలంలోని బండారిగూడెం గ్రామానికి చెందిన ముచికి దేవమ్మ కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతూ రాజమ్రండి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిందని ఆయన తెలిపారు. ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు కూడా కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు లేకపోవడంతో తానే చొరవ తీసుకోని స్వగ్రామానికి తీసుకొచ్చే ఏర్పాటు చేసినట్లు మైసాక్షి చెప్పారు. వెంకటాపురం నుంచి బండారిగూడెం గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో డోలీలో 3 కిలోమీటర్లు మృతదేహాన్ని మోసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైందని తెలిపారు. గిరిజనులు ఇటువంటి దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని, ఇకనైనా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర బడ్జెట్



మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కేంద్రం బడ్జెట్ రూపొందించిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. గురువారం భీమవరంలో నిర్వహించిన మేధావుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌పై అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించడం కోసం దేశవ్యాప్తంగా మేధావుల సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎల్ మాధవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్లో భారీ కేటాయింపులు చేశారని ప్రధానంగా పోలవరం, అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడం అభినందనీయమన్నారు. బీజేపీ నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్‌రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ కాగిత వెంకటరమణ, తాడేపల్లిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యూట్రన్, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

డ్రెయినేజీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



డ్రెయినేజీ లభ్యమైన వ్యక్తి మృతదేహం

తాడేపల్లి గూడెం అర్బన్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని డ్రెయినేజీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. డ్రెయినేజీలో మృతదేహం ఉండడాన్ని స్థానికులు చూసి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని డ్రెయినేజీలోని మృతదేహాన్ని వెలుపలకు తీయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు నీలం చొక్కా, నల్లప్యాంటు ధరించాడని, వివరాలు తెలిసిన వారు తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.

మామిడి.. తగ్గనున్న దిగుబడి

- మామిడి తోటలపై తామర పురుగు దాడి
- నిలువునా మాడిపోయిన పూత
- పెట్టుబడులు రాక నష్టాల ఊబిలో రైతాంగం
- రెండేళ్లుగా మామిడి రైతులకు నష్టాలు



నూజివీడు : మామిడి తోటలకు రసాయన మందుల పిచికారీ



చింతలపూడి : మంచు కురవడం వల్ల మాడిపోయిన మామిడి పూత

నూజివీడు/చింతలపూడి: పండ్లలో రారాజు.. మామిడి. కానీ మామిడిని సాగు చేస్తున్న రైతుల పరిస్థితి మాత్రం ఏటా దారుణంగా తయారవుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, పురుగుల బెడద కారణంగా ఆదాయం రాకపోగా నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. నూజివీడు డివిజన్‌లో ప్రధాన వాణిజ్య పంటగా మామిడి దశాబ్దాలుగా భాసిల్లుతోంది. నూజివీడు రసాలు.. బంగినపల్లి ఖండాంతరాల్లో ఎంతో ఖ్యాతినార్జించింది. అలాంటి మామిడి పరిస్థితి దయనీయంగా తయారవుతోంది. గతేడాది కాపులేకపోవడంతో ఈ ఏడాదైనా మామిడి ఆదుకుంటుందనే గంపెడాశతో ఉన్న రైతులను నట్టేట ముంచింది.

ఆశలు ఆవిరి

నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, లింగపాలెం మండలాల్లో ఉన్న మామిడి తోటల్లో డిసెంబరు నుంచి పూతలు గణనీయంగా రావడంతో రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. బంగినపల్లి, తోతాపురి, రసాలు తదితర అన్ని రకాల్లో పూతలు ముమ్మరంగా వచ్చాయి. డివిజన్‌లోని మొత్తం విస్తీర్ణంలో 80 నుంచి 90 శాతంకు పైగా తోటల్లో ఈ ఏడాది పూతలు వచ్చాయి. అయితే జనవరి రెండో వారం నుంచి మామిడి తోటలపై తామర పురుగు దాడి చేయడంతో వచ్చిన పూతంతా నిలువునా మాడిపోయింది. తామర పురుగుకు బూడిద తెగులు తోడవ్వడంతో మామిడి రైతుల పరిస్థితి కోలుకోలేని విధంగా తయారైంది. ఒక్కొక్క రైతు మామిడి పూత నిలుపుకోవడం కోసం 10 నుంచి 12 సార్లు రసాయన మందులను పిచికారీ చేసినప్పటికీ తామర పురుగును నియంత్రించలేకపోవడం గమనార్హం. దీంతో మామిడిపై రైతుల ఆశలన్నీ అడియాశలైపోయాయి. డివిజన్‌లోని 40వేల ఎకరాల్లో విస్తరించిన మామిడి తోటల పరిస్థితి దయనీయంగా మారింది.

పూత దశలోనే.. నష్టాల ఊబిలో

చింతలపూడి నియోజకవర్గంలో సైతం మామిడి రైతులకు ఈ సంవత్సరం గడ్డు పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది పూత దశలోనే మామిడి రైతులు నష్టాల ఊబిలో చిక్కుకున్నారు. నియోజకవర్గంలో 80 శాతం పైగా మామిడి తోటలు ఈ సంవత్సరం పూత పూసినప్పటికీ మంచు వల్ల పూత మాడిపోయి, పిందెలు రాలిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఫలితంగా ఈ ఏడాది మామిడి దిగుబడి గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. 30 ఏళ్ల క్రితం దాదాపు 60 వేల ఎకరాల్లో ఉండే మామిడి..ఏటా వివిధ కారణాలతో మామిడి రైతులు నష్టపోతుండడంతో ఇప్పుడు కేవలం 7 వేల ఎకరాలకు పడిపోయింది. రైతులు మామిడి తోటలు నరికివేసి ప్రత్యామ్నాయంగా పామాయిల్, మొక్కజొన్న, పొగాకు, వేరుశనగ వంటి వాణిజ్య పంటలు పండిస్తున్నారు. నియోజకవర్గంలో ఏటా 90 శాతం బంగినపల్లి, 10 శాతం కలెక్టర్ (తూతాపురి) దిగుబడి ఉంటుంది. ప్రభుత్వం నుంచి మామిడి పంటకు సరైన ప్రోత్సాహం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పూత మాడిపోయింది



జనవరిలో తామరపురుగు ఆశించడంతో పదెకరాల్లో మామిడి తోట పూతంతా మాడిపోయింది. తామర పురుగు నివారణకు 8 సార్లు మందులు కొట్టినా ఉపయోగం లేకుండా పోయింది. పది ఎకరాలకు రూ.5 లక్షల వరకు పెట్టుబడి అయింది. బంగారు నగలు సైతం బ్యాంకుల్లో పెట్టి అప్పులు చేసి మామిడి తోటకు పెట్టుబడి పెట్టాను.

– ఆరేపల్లి శివరామకృష్ణ, సుంకొల్లు, నూజివీడు మండలం

దిగుబడి తగ్గింది



నాలుగెకరాల్లో మామిడి తోట ఉండగా పూత బాగానే వచ్చింది. దీంతో 15 టన్నుల దిగుబడి వస్తుందనుకున్నా. ఇప్పుడు చూస్తే మూడు టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేదు. తామర పురుగు ఆశించి మామిడి పూతంతా మాడిపోయింది. నాలుగెకరాలకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి అయింది. దిగుబడి చేతికి వచ్చే గ్యారంటీ లేకుండా పోయింది.

– నీలపాల శివకోటేశ్వరరావు, యనమదల, నూజివీడు మండలం

నష్టాలు భరించలేక..



ఈ సంవత్సరం మామిడి తోటలు మంచు బారిన పడి పూత మాడిపోతున్నాయి. ప్రతి ఏటా ఈపాటికి చిన్నసైజు పిందెలు కాసేవి. వాతావరణ పరిస్థితులు చూస్తే ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గేలా ఉంది. గతంలో నాకు 10 ఎకరాల మామిడితోట ఉండేది. నష్టాలు భరించలేక తోటలు నరికివేశాను. ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటలు పండిస్తున్నాం.

– చేపూరి ఖాదర్‌బాబు, రైతు, శెట్టివారిగూడెం

ఆకతాయిల వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య



నాగ దీప్తి (ఫైల్)

కామవరపుకోట: ఆకతాయిల వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం కామవరపుకోట పంచాయతీ వడ్లపల్లిలో చోటుచేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వడ్లపల్లి గ్రామానికి చెందిన గంజి నాగ దీప్తి (19) ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. గత కొంతకాలంగా నాగ దీప్తి కాలేజీకి వచ్చి, వెళ్లే సమయాల్లో కామవరపుకోటకు చెందిన ఆకతాయిలు ఆమెను ప్రేమించాలని, లేకపోతే మీ కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించేవారు. ఈ విషయంపై ఆమె అన్నయ్య అరవింద్ ఆ యువకులను నిలదీశాడు. దీంతో ఇటీవల కామవరపుకోటలో జరిగిన వీరభద్ర స్వామి తిరునాళ్లలో అరవింద్‌ను తీవ్రంగా కొట్టినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. బుధవారం మళ్లీ ఆ యువకులు నాగ దీప్తికి ఫోన్ చేసి తమను ప్రేమించకపోతే మీ అన్నయ్యతో సహా మీ కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించారు. దీంతో మనస్థాపానికి గురైన నాగదీప్తి గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆసమయంలో తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, రాణి వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వెళ్లగా అన్నయ్య అరవింద్ గదిలో నిద్రపోతున్నాడు. నాగ దీప్తి ఫ్యానుకు వేలాడుతూ ఉండడాన్ని గమనించిన అరవింద్ చుట్టుపక్కల బంధువుల సహాయంతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నా కుమార్తె మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆమె కన్నీటి పర్యంతమైంది. ఈ ఘటనపై తడికలపూడి ఎస్సై చెన్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో నూతన నియామకాలు

పార్టీ అనుబంధ విభాగ కమిటీల్లో పలువురికి చోటు



గంటా సంధ్య, పార్టీ రాష్ట్ర మహిళా విభాగ సెక్రటరీ



కె.కనకదుర్గారాణి, రాష్ట్ర మహిళా విభాగ సెక్రటరీ



సయ్యపురాజు గుర్రాజు, రాష్ట్ర రైతు విభాగ సెక్రటరీ



ఐనాల బ్రహ్మాజీ, రాష్ట్ర రైతు విభాగ జాయింట్ సెక్రటరీ



బలే నాగరాజు, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ



పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీ



పాతినవలస రాజేష్, ఏలూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు

కైకలూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో ఏలూరు జిల్లాకు చెందిన పలువురి పార్టీ నాయకులను వివిధ హోదాల్లో నియమిస్తూ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు అందాయి. నియామకాల్లో పార్టీ రాష్ట్ర మహిళా విభాగ సెక్రటరీలుగా గంటా సంధ్య, కూసనపూడి కనకదుర్గారాణి (బుజ్జమ్మ), రాష్ట్ర రైతు విభాగ సెక్రటరీగా సయ్యపురాజు గుర్రాజు, రాష్ట్ర రైతు విభాగ జాయింట్ సెక్రటరీగా ఐనాల బ్రహ్మాజీ, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీలుగా పరసా చిన్నారావు, కిలారపు శ్రీనివాసరావు(బుజ్జి), బలే నాగరాజు, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీగా కోటగిరి రాజా నాయన, పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ ఉన్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఎంపికైన నాయకులు చెప్పారు. రాష్ట్ర స్థాయి పదవులు అందించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కమిటీలో చింతలపూడి నేతలు

చింతలపూడి: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కమిటీలో పార్టీ చింతలపూడి నియోజకవర్గ నాయకులు ఏడుగురు చోటు సంపాదించారు. జిల్లా వైఎస్ ప్రెసిడెంట్‌గా జగ్గవరపు జానకిరెడ్డి, జనరల్ సెక్రటరీగా మోరంపూడి జగన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ముప్పిడి శ్రీను, రాయంకు సత్యనారాయణ, యాక్టివ్ సెక్రటరీగా వామిశెట్టి హరిబాబు, అయినాల వెంకటరమణ మూర్తి, అధికారిక ప్రతినిధిగా రాఘవరాజు ఆదివిష్ణు నియమితులయ్యారు. వీరిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు, పలువురు అభినందించారు.

ఏలూరు నుంచి రాజేష్

ఏలూరు టౌన్: ఏలూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత పాతినవలస రాజేష్ (కరుణ)ను పార్టీ ఏలూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమించారు. రాజేష్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తున్నారు. పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పార్టీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ సూచనలతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

అక్రమాలకు అడ్డాగా గూడెం !

- గత ఐదేళ్లుగా ప్రశాంతంగా పట్టణం
- ప్రస్తుతం సీన్ రివర్స్
- జూదాలు, గంజాయి, దొంగనోట్ల బ్యాచ్‌లకు అడ్డాగా మారుతున్న వైనం
- భయాందోళన చెందుతున్న ప్రజలు



గూడెం పట్టణం వ్యూ

తాడేపల్లిగూడెం: గత ఐదేళ్లుగా ప్రశాంతంగా ఉన్న గూడెం పట్టణం మళ్లీ అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారుతోంది. పాతికేళ్ల క్రితం పట్టణం పేకాట బ్యాచ్, దొంగనోట్లకు అడ్డా. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గడిచిన ఐదేళ్ల కాలంలో అసాంఘిక శక్తుల బెండు తీశారు. దొంగనోట్ల ముఠాలు, రౌడీ షీటర్లు పత్తాలేకుండా పోయారు. ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యినట్టు కనిపిస్తోంది. పట్టణంలో వరుసగా జరుగుతున్న కొన్ని ఘటనల ఆధారంగా ఈ విషయం స్పష్టమవుతోంది. తాజాగా జూదశాలలు పట్టణంలో యథేచ్ఛగా సాగుతున్నట్టు సమాచారం. ఇక్కడ పార్టీలు, కూటములతో సంబంధం లేకుండా జూదాలు నడుపుతున్నట్టుగా తెలుస్తోంది. అలాగే బ్లేడ్ బ్యాచ్‌లు కాస్తా, గంజాయి బ్యాచ్‌లుగా రూపాంతరం చెందారు. నెల రోజుల క్రితం వరకు పట్టణంలో గంజాయి వాసన కనిపించగా అరకొర దాడులు, కేసులు నమోదుతో ఆగినట్టుగా కనిపిస్తోంది.

అన్ని వైపులా జూదశాలలున్నాయా!

పట్టణంలో మూడు దిక్కుల్లో జూదశాలలు రహస్యంగా నిర్వహిస్తున్నట్టుగా సమాచారం. కడకట్ల, టూటౌన్ తణుకు మార్గంలో ఒక ప్రాంతంలో ఇవి ఉన్నట్టుగా తెలుస్తోంది. వీటి నిర్వహణకు ఆమోద ముద్ర ఎవరు వేశారన్నది బహిరంగ రహస్యమేనని చెబుతున్నారు. రిమోట్ మాత్రం కడకట్ల ప్రాంతంలో ఉన్నట్టుగా జూదరులు బాహాటంగా అంటున్నారు. గతంలో పట్టణంలో ఆమోదిత జూదశాలలు ఉండేవి. ఆఫీసర్స్ క్లబ్, ఎన్జీవోస్ హోం వంటి చోట నిర్దేశిత సమయాల్లో సీక్వెన్స్ ఆడుకొనే వెసులుబాటు ఉండేది. అలాంటి సమయంలో పోలీసుల దయాదాక్షిణ్యాలతో కొందరు పేకాటలను రహస్య ప్రాంతాల్లో నిర్వహించేవారు. క్లబ్‌లను అప్పట్లో ప్రభుత్వమే మూసివేసియడంతో పేకాటలపై పోలీసులు దాడులు పరిపాటిగా మారింది. తాజాగా జూద సంస్కృతి మళ్లీ తెరమీదకు వచ్చింది. పాత బ్యాచ్‌లు జూలు విదిల్చామనే సంకేతాలను వీటి నిర్వహణ ద్వారా ఇస్తున్నట్టు తెలుస్తోంది.

దొంగనోట్ల ముఠాలూ వచ్చాయా!

ఒకప్పుడు పట్టణం దొంగనోట్ల ముఠాలకు అడ్డా. నకిలీ కరెన్సీని బ్యాంకుల్లో కూడా జమచేసే కేటుగాళ్లు ఇక్కడ ఉండేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దొంగనోట్ల ముఠా ఎక్కడ దొరికినా మూలాలు ఇక్కడే ఉండేవి. జెకోస్లోవేకియా నకిలీ నోట్లను ఇక్కడ మార్చే ముఠాలు ఉండేవి. కాలక్రమంలో కనుమరుగయ్యాయి. తాజాగా మద్యం దుకాణాలలో, రద్దీగా ఉన్న వ్యాపార సముదాయాల్లో కొందరు యువకులు దొంగనోట్లు మారుస్తున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులో తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై గూడెం పట్టణం, రూరల్, తణుకు సర్కిళ్ల పరిధిలో ఉన్న అధికారులు కూపీలాగే ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ప్రచారం ఉంది. సుమారు 15 సెల్‌ఫోన్లలో ఉన్న సమాచారాన్ని విశ్లేషించి ముఠా ఆనవాళ్లు తదితర అంశాలను వెలుగులోకి తీసుకొచ్చి నిందితులను కటకటాల వెనక్కి పంపించనున్నారని తెలుస్తోంది. వ్యాపార కేంద్రం నుంచి విద్యా కేంద్రంగా మారి అభివృద్ధి పథంలో వెళుతున్న పట్టణంలోని తిరిగి పాత జాడ్యాల వాసనలు రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పట్టిసం ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



పట్టిసంలో గోదావరి నది దాటేందుకు పంట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



పట్టిసంలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలవరం సీఐ

పోలవరం రూరల్: ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు పట్టిసంలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ లక్షమందికి పైగా భక్తులు ఉత్సవాలకు హాజరవుతారనే అంచనాతో అధికార యంత్రాంగం ఆ దిశగా ఏర్పాట్లు చేపట్టింది. పంచాయతీ చేపట్టే పనులు ఈ ఏడాది కొంత ఆలస్యమయ్యాయి. గత నాలుగేళ్లుగా పనులు చేపట్టిన టెండర్‌దారులకు రూ.28 లక్షల వరకు బకాయిలు ఉన్నాయని, అందువల్ల టెండర్‌దారులు ముందుకు రాలేదని సిబ్బంది చెబుతున్నారు. ఫెర్రీ టిక్కెట్ రేటును ప్రస్తుతం రూ.30 వసూలు చేస్తుండగా, ఈ ఏడాది అదనంగా మరో రూ.10 పెంచి రూ.40 వసూలు చేసేందుకు నిర్ణయించారు. భక్తులు శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామిని దర్శించుకునేందుకు కాలినడకన వెళ్లి రావాల్సిందే. పంచాయతీ చేపట్టే పనులకు సంబంధించి కొంత సొమ్ము దేవస్థానం అధికారులు ఇచ్చేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితి ఇలా ఉంటే శివక్షేత్రం వద్ద భక్తులు దైవ దర్శనం చేసుకుని వెళ్లే విధంగా చేపట్టే ఏర్పాట్లు దాదాపు పూర్తి కావచ్చాయి. అలాగే దర్శనానికి వెళ్లే భక్తులు నది దాటి వెళ్లేందుకు వీలుగా ఫ్లాట్‌ఫారాలు, పంట్లు, టిక్కెట్ కౌంటర్‌లు, చలువ పందిళ్ల తదితర పనులు కూడా వేగంగా సాగుతున్నాయి.

ఇంకా చేపట్టాల్సిన పనులు

ఇసుక తిన్నెలపై చేపట్టే ఇంకా కొన్ని పనులు ప్రారంభమే కాలేదు. స్నానఘట్టాలతో పాటు, మహిళలు దుస్తులు మార్చుకునే తాత్కాలిక ఏర్పాట్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. వెదురు కర్రలు, తడికలతో వీటిని ఏర్పాటు చేస్తారు. తాగునీటికి పైప్‌లైన్, చేతిపంపు నిర్మించాల్సి ఉంది.

ఏర్పాట్లు పరిశీలించిన సీఐ

పట్టిసం రేవులో జరుగుతున్న ఉత్సవ ఏర్పాట్లను పోలవరం సీఐ సురేష్‌బాబు, ఎస్సై పవన్‌కుమార్ పరిశీలించారు. క్యూలైన్‌లు, కంపార్ట్‌మెంట్‌లు తదితర పనులను పరిశీలించి ఫెర్రీ కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. ఉత్సవాల సమయంలో పోలీసుల అనుమతి లేకుండా పట్టిసీమ, గూటాల, పోలవరం తదితర ప్రాంతాల్లో ప్రయాణికులతో పడవలను నడపరాదని హెచ్చరించారు.

బియ్యం లారీ చోరీ చేసిన ముగ్గురి అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రావణ్ కుమార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

ఏలూరు టౌన్: బియ్యం లారీ చోరీ చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం డీఎస్పీ డి.శ్రవణ్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఏలూరు కంద్రికగూడెం సమీపంలోని ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద 290 బస్తాల బియ్యంతో ఉన్న లారీని గత నెల 29వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. లారీకి ఉన్న జీపీఎస్ ట్రాకర్‌ను పడేసి ఈ చోరీ చేశారు. బియ్యం విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుంది. దీనిపై లారీ యజమాని ఫిర్యాదు చేయగా ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అత్యాధునిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల సహాయంతో కేసును పోలీసులు విచారణ చేశారు. గురువారం ఏలూరు రూరల్ పరిధిలో లారీలో ఉన్న బియ్యాన్ని విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ బియ్యంతో సహా లారీని, నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు కొత్తూరు గ్రామానికి చెందిన జన్యవుల సుధాకర్‌గా గుర్తించగా పెరవలికి చెందిన దూడల ధనరాజు, కొల్లేపుర మణికంఠ అతడికి సహకరించినట్లు డీఎస్పీ తెలిపారు. సుధాకర్‌పై రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులు పదుల సంఖ్యలో ఉన్నాయని, షీట్ తెరిచేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించిన సీసీఎస్ పోలీసులు, ఏలూరు వన్‌టౌన్ పోలీసులను అభినందించారు. సమావేశంలో ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్, సీసీఎస్ ఏఎస్సై ఎండి రుహుల్ల, శేషు కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతి వేగం

ఒకరు మృతి.. మరొకరికి స్వల్ప గాయాలు



ఘటనా స్థలంలో విజయ్‌కుమార్ మృతదేహం

దేవరపల్లి : అతివేగం ఒక యువకుడి ప్రాణం తీసింది. ఆగి ఉన్న వ్యాన్‌ను మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం విజయవాడకు చెందిన కల్లూరి విజయ్‌కుమార్ (30), ఏలూరులోని వినాయకనగర్‌కు చెందిన ఏలేటి గోవింద్ వరుసకు బావ, బావమరుదులు. ఇద్దరూ కలసి గురువారం ఉదయం విశాఖపట్టణంలో బంధువుల వివాహానికి బయలుదేరారు. విజయ్‌కుమార్ ద్విచక్ర వాహనం నడుపుతుండగా, గోవింద్ వెనుక కూర్చున్నాడు. దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్దకు వచ్చే సరికి హైవేపై ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను వెనుక నుంచి బలంగా ఢీ కొన్నారు. ఈ ఘటనలో విజయ్‌కుమార్ తలకు బలమైన గాయం కాగా చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. గోవింద్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నట్టు ఏఎస్సై నాగభూషణం తెలిపారు. విజయ్‌కుమార్‌కు హెల్మెట్ ఉన్నప్పటికీ ధరించకపోవడం వల్ల మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదిలమైన ఫలితాలే లక్ష్యం

- పరీక్షలకు సిద్ధమవుతున్న పదోతరగతి విద్యార్థులు
- నూరు శాతం ఉత్తీర్ణత కోసం శ్రమిస్తున్న వైనం

తణుకు అర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నారు. ప్రతి పాఠశాలల్లోను విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు తుది దశకు చేరింది. వచ్చే నెల 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ముందుగానే ప్రకటించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నారు. మెరిట్ విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా వెనుకబడిన విద్యార్థులు పాస్ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కసరత్తులు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఉదయం, సాయంత్రం అదనపు సమయాలు కేటాయించి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

ప్రిపరేషన్ ఇలా

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటి, తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు 60 పాఠశాలలకు సంబంధించి 5528 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థులు ఒకరికంటే మరొకరు పబ్లిక్ పరీక్షలో మంచి మార్కులు సాధించేందుకు పోటీపడేలా చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తుంటే ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం మంచి మార్కులు తెచ్చుకునేందుకు ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రతి సబ్జెక్ట్‌లోని పాఠ్యాంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని పాఠ్యాంశంలోని ప్రశ్నలకు జవాబులను రూపొందించేలా యాక్షన్ ప్లాన్‌తో విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఉదయం గంట, సాయంత్రం గంటన్నర అదనపు తరగతులు నిర్వహిస్తూ సానపడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో వారానికో పరీక్ష నిర్వహిస్తుండగా మరికొన్ని పాఠశాలల్లో మాత్రం బాగా మెరిట్ విద్యార్థులను గుర్తించి వారికి ప్రతిరోజూ పరీక్ష నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా వెనుకబడిన విద్యార్థులను ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారిపై పూర్తిస్థాయి దృష్టిపెట్టి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో విద్యార్థులు ఇలా

పాఠశాలలు	తణుకు	ఇరగవరం	అత్తిలి
ప్రభుత్వ పాఠశాలలు	11	7	10
ప్రైవేటు పాఠశాలలు	27	1	4
ప్రభుత్వ విద్యార్థులు	2730	456	380
ప్రైవేటు విద్యార్థులు	1803	26	133


తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ప్రత్యేక పరీక్ష రాస్తున్న విద్యార్థులు


ప్రత్యేక తరగతుల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులపై పూర్తి పర్యవేక్షిస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. విద్యాబోధనలో తల్లితండ్రులు, పేరెంట్స్ కమిటీని కూడా భాగస్వామ్యం చేస్తూ విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులంతా కృషి చేస్తున్నాం.

– డి.మురళి సత్యనారాయణ, డీవైఈవో, తణుకు

మంచి మార్కులు సాధిస్తాను



పదో తరగతి పరీక్షలకు పూర్తిగా సన్నద్ధం అయ్యాను. మా ఉపాధ్యాయులు మమ్మల్ని చాలా బాగా తీర్చిదిద్దుతున్నారు. తల్లితండ్రులు, ఉపాధ్యాయులు మాపై ఎంతో నమ్మకం పెట్టుకుని విద్యాబోధన చేస్తున్నారు. వారి నమ్మకాన్ని వృథా చేయకుండా మంచి మార్కులు సాధించే దిశగా కృషి చేస్తున్నాను.

– పేకేటి నమిత, 10వ తరగతి విద్యార్థిని, తణుకు

విద్యకు అత్యధిక ప్రాధాన్యత..



మా పాఠశాలలో ఉపాధ్యాయులు మాపై ఎంతో నమ్మకం పెట్టుకుని మాకు విద్యాబోధన చేస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయులు మాపై ఎంతో శ్రద్ధ చూపిస్తూ మాకోసం ఎంతో కృషి చేస్తున్నారు. పాఠశాలలో ఉండి మేము చదువుకునేందుకు ఎంతో ప్రాధాన్యతనివ్వడమే కాకుండా మానవత సంస్థ ద్వారా సాయంత్రం స్టడీ హవర్స్‌లో అల్పాహారం అందిస్తున్నారు.

కొల్లి సౌజన్య, పదో విద్యార్థిని, తణుకు

క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


హెల్మెట్ ధరించని యువకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్సై కొండలరావు

తాడేపల్లిగూడెం అర్బన్ : యువకులు హెల్మెట్ ధరించకుండా అతివేగంగా మోటారు బైక్‌లను నడుపుతున్న కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్సై కొండలరావు తెలిపారు. గురువారం పట్టణంలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. రోడ్లపై అతివేగంగా బైక్‌లను నడుపుతున్న యువకులను అడ్డుకున్నారు. వారి వద్ద డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి పలు విషయాలను తెలుసుకున్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌ను తక్షణం దరఖాస్తు చేసుకోవాలని యువకులకు సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధికి పాటుపడాలి


కొండేపాడులో మాట్లాడుతున్న సర్వశిక్ష అభియాన్ ఎమ్మెస్‌వో

పెంటపాడు: చిన్నారి విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అధికారులు పాటు పడాలని సర్వ శిక్ష అభియాన్ అధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం బి. కొండేపాడులో ప్రాథమికోన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంగన్‌వాడీ విద్యార్థుల విద్యాబోధన సమగ్రంగా ఉండాలన్నారు. విద్యావ్యవస్థలో ప్రారంభ దశను ప్రతిష్టపరచాలనే ఉద్దేశ్యంతో సిబ్బంది లక్ష్యాలను మర్చిపోరాదన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, బి.రోజమ్మ, బి. శ్రీనివాస్, విజయలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ అందుకున్న వీరవెంకటేష్


కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న డాక్టర్ వీరవెంకటేష్

తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) అవార్డు లభించింది. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వీరవెంకటేష్ ఈ అవార్డును కలెక్టర్ నాగరాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చేతుల మీదుగా అందుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని వసతులు, సేవలు, పరిశుభ్రత తదితర అంశాలను ఇటీవల కేంద్ర పర్యవేక్షణ బృందం పరిశీలించింది. దీనిలో పీహెచ్‌సీకి 93 శాతం స్కోర్ రావడంతో ఈ అవార్డు లభించిందని డాక్టర్ వీరవెంకటేష్ గురువారం తెలిపారు. సిబ్బంది సమష్టి కృషితోనే ఈ అవార్డు సాధ్యమైందని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీల పాత్ర కీలకం


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ ఏఎంవో సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని ఎస్ఎస్ఏ అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి సీహెచ్. సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కృష్ణాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంగన్‌వాడీ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ఈ శిక్షణ తరగతులను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవో-2 పీఎంకే జ్యోతి, వెన్యూ కోఆర్డినేటర్ జి.కనకదుర్గ, హెచ్‌ఎం, డీఆర్‌పీలు ఎ.పోతురాజు, ఆర్.రామభద్రరావు, పి.సన్యాసిరావు పాల్గొన్నారు.

24న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

అత్తిలి: మండలంలోని ఈదూరు గ్రామంలో ఉన్న శ్రీవరాల వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 24న 108 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు గురువారం విలేకరులకు తెలిపారు. సోమవారం ఉదయం స్వామి వారి గ్రామోత్సవం నిర్వహిస్తామని, అనంతరం సత్యనారాయణస్వామివ్రతాలు, శ్రీనివాస కల్యాణం ఉంటుందని వివరించారు.

రాచర్లలో 23 నుంచి ఓపెన్ లైఫ్ సభలు

పెంటపాడు: రాచర్లలోని రూపాంతర దేవాలయ ఆవరణలో ఈనెల 23,24 తేదీల్లో ఓపెన్ సభలు నిర్వహించనున్నట్టు సేవకురాలు స్వప్న ఎడ్వర్డ్ తెలిపారు. హైదరాబాద్ ఇమ్మానియేలు మినిస్ట్రీస్ వర్తమానికులు పాస్టర్ బి.జెర్మియా, బ్రదర్ ప్రవీణ్ పగడాల, పారిశ్రామిక వేత్త మానుకొండ మార్కు తదితరులు హాజరవుతారన్నారు. ఉదయం, రాత్రి వేళల్లో నిర్వహించే ఈ సమావేశాలను పరిసర గ్రామ విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

25 నుంచి శివరాత్రి ఉత్సవాలు


వీరంపాలెం బాలాత్రిపుర సుందరీ పీఠం

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం బాలాత్రిపుర సుందరీ పీఠం ప్రాంగణంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠం వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 25న ఉదయం 9.23 గంటలకు రుద్రయాగ సహిత మహాకుంభాభిషేక మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు. 26న మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారు జామున 12 పవిత్ర నదీ జలాలతో, 12 విశేష ద్రవ్యాలతో స్వామివారికి మహా కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. 27న సంపూర్ణ పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. అదే రోజు రాత్రి శాంతి కల్యాణం, గ్రామోత్సవం నిర్వహిస్తామని గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి కోరారు.

బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీవీ సూర్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐబీఈఏ జాతీయ సమితి సభ్యులు టీవీ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మార్చి 24, 25 తేదీల్లో బ్యాంక్ ఉద్యోగుల రెండు రోజుల దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద యూఎఫ్‌బీయూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బ్యాంకు ఉద్యోగులు దేశ వ్యాప్తంగా సమ్మె చేయనున్నారని తెలిపారు. బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలు రెండేళ్ల పెండింగ్‌లో ఉంచడం సరికాదని, 5 పనిదినాలు సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 30 ఏళ్ల ముందు ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం రివిజన్ కోసం రూ.10 లక్షల పెన్షనర్లు ఎదురు చూస్తున్నారని అన్నారు. స్టేట్ బ్యాంక్ అధికారుల సమాఖ్య (ఏఐబీఓసీ) జోనల్ కార్యదర్శి జి.జవహర్‌లాల్ మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఓబీఐస్టాఫ్ యూనియన్ జాయంట్ సెక్రటరీ బి.ఏడుకొండలు, డిప్యూటీ రీజనల్ సెక్రటరీ బి.దివ్య రంజని మాట్లాడుతూ రెండు రోజుల సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛీఫ్ మేనేజర్ పీపీఎస్ఆర్ బాబు, బ్యాంక్ సంఘాల నాయకులు కిరణ్, పవన్‌కుమార్, సూర్యనారాయణ, కేవీబీ నాయకులు శ్రీనివాస్, కనకారావు, అపర్ణ, ఇందిరా ప్రియదర్శిని, పలివెల శ్రీనివాస్, ప్రదీప్ పాల్గొన్నారు.

నేడు బ్యాంక్ ఉద్యోగుల ధర్నా

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశ వ్యాప్తంగా చేపట్టిన బ్యాంక్ ఉద్యోగుల సమ్మె మార్చి 24, 25 కార్యాచరణలో భాగంగా బ్యాంక్ యూనియన్ల పిలుపు మేరకు ఈ నెల 21న బ్యాంక్ ఉద్యోగుల ధర్నా పట్టణంలో నిర్వహించనున్నట్టు తాడేపల్లిగూడెం యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఏబీఈఏ జాతీయ సమితి సభ్యులు టీవీ సూర్యనారాయణ, బ్యాంకు అధికారుల సమాఖ్య జోనల్ కార్యదర్శి జి.జవహర్ లాల్ గురువారం పట్టణంలో వివరాలను వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు కె.ఎన్.రోడ్డు ఎస్‌బీఐ ఈ కార్నర్ వద్ద జరిగే ధర్నాకు పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన బ్యాంకు ఉద్యోగులు పూర్తి సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యూబీఐ ఉద్యోగ సంఘం డిప్యూటీ రీజనల్ కార్యదర్శి బి.దివ్య రంజని, ఎస్‌సీబీఈ నాయకులు పవన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఈ రఘునాథబాబు

తణుకు అర్బన్: సోలార్ రూఫ్ టాప్ అమర్చుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చని విద్యుత్ శాఖ ఎస్ఈ ఆలపాటి రఘునాధబాబు అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై గురువారం తణుకు విద్యుత్ శాఖ ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూర్యరశ్మి నుంచి పుట్టే సోలార్ విద్యుత్ ఉత్పత్తితో గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని, విద్యుత్ వినియోగదారులంతా ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సోలార్ రూఫ్ టాప్‌ను అమర్చుకోవాలని కోరారు. 1 కిలో వాట్‌కు రూ. 30 వేలు, 2 కిలో వాట్లకు రూ. 60 వేలు, 3 కిలో వాట్లకు రూ. 78 వేలు చొప్పున రాయితీ వస్తుందని స్పష్టం చేశారు. రానున్న వేసవిలో విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు ఇదో మంచి అవకాశమని అన్నారు. ఈ సందర్భంగా సోలార్ వెండర్స్ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై అవగాహనతోపాటు పలు సందేహాలను తీర్చారు. ఈ కార్యక్రమంలో డీఈ కె.నరసింహమూర్తి, డీఈఈ పి.శ్రీనివాసు, ఏఈలు దొల సాదిక్, ఎం.జాన్సన్, ఏవీ రమణమూర్తి, మండల పరిషత్ ఏఈ వి.కృష్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపాలెంలో ఉచిత వైద్య శిబిరం


నవాబుపాలెంలో ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న సర్పంచ్ గంగాభవాని

తాడేపల్లిగూడెం రూరల్: నవాబుపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత శిబిరాన్ని సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం విజయవాడకు చెందిన ఆంధ్రా ఆసుపత్రి వైద్యులు గుండె, లివర్, తణుకు లలిత గ్యాస్ట్రో లివర్ కేర్ ఆసుపత్రి వైద్యులు గ్యాస్, లివర్, కిడ్నీ వ్యాధులకు, ఏలూరు గుడ్ సమరిటన్ ఆసుపత్రి వైద్యులు ఎముకలు, చర్మం, పులిపిరి కాయలు, గడ్డలకు, కాళ్ల తిమ్మిర్లు వంటి వ్యాధులకు 150 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాసా బాబూరావు, కార్యదర్శి జీవీ.సుబ్బారావు, కోశాధికారి ఉండ్రాజవరపు భాస్కరరావు, గ్రామ పెయింటర్ సంఘ నాయకుడు జాన్, నాగరాజు, పండు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఫీజుల వివరాలు డిస్‌ప్లే చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం, స్కానింగ్ సెంటర్లు, డైయాగ్నటిక్ సెంటర్ల యాజమాన్యం తప్పనిసరిగా వారి రిజిస్ట్రేషన్ వివరాలు, పనిచేస్తున్న డాక్టర్లు, స్టాఫ్ వివరాలు, టెస్టులు, వైద్యానికి వసూలు చేసే ఫీజుల వివరాలు, రిసెప్షన్ కౌంటర్ల వద్ద డిస్‌ప్లే ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ నుంచి తనకు సర్క్యులర్ అందిందని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఆర్‌కే హనుమంతరావు (తాడేపల్లిగూడెం) గురువారం వెల్లడించారు. ప్రైవేట్ యాజమాన్యం, నిర్వాహకులు ఎవరికి తోచిన విధంగా వారు వైద్య పరీక్షలకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు రావడం, క్వాలిఫైడ్ కాని డాక్టర్లు, టెక్నీషియన్లు పనిచేస్తున్నారని ప్రజల నుంచి అనేక వినతులు వచ్చాయన్నారు. దీనిపై స్పందించి అన్ని సెంటర్ల వద్ద వివరాలను డిస్‌ప్లే చేయాలని కోరుతూ కలెక్టర్‌కు, డీఎం అండ్‌హెచ్‌ఓకు తాను లేఖలు పంపినట్లు వెల్లడించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి తనకు సర్క్యులర్ అందిందని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యం, స్కానింగ్ సెంటర్స్, డైయాగ్నటిక్ సెంటర్ వారు బోర్డు డిస్‌ప్లే చేయకపోతే, ఫీజులు ఎక్కువ వసూలు చేసినా కలెక్టర్, డీఎంఅండ్ హెచ్‌ఓలకు నేరుగా ఫోన్ చేసి, లేదా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కలెక్టర్ ఫోన్ నంబర్ 88778 97789, డీఎం అండ్ హెచ్‌ఓ ఫోన్ నంబర్ 99123 41474 సంప్రదించవచ్చునని వివరించారు.

జాతీయ లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలి


డి.సత్యవతి

తణుకు అర్బన్: జాతీయ న్యాయ సేవల సంస్థ ఆదేశాల మేరకు 2025 సంవత్సరానికి గానూ నాలుగు సార్లు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పేర్కొన్నారు. తణుకు కోర్టులో గురువారం జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ ఏడాదికి సంబంధించి వచ్చే నెల 8న మొదటి జాతీయ లోక్ అదాలత్ అన్ని కోర్టుల్లోనూ నిర్వహించనున్నారని వివరించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంతోపాటు రాజీకాదగ్గ కేసులన్నీ రాజీ చేసే దిశగా కృషి చేయడమే జాతీయ లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమన్నారు. కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయాన్ని, డబ్బు ఆదా చేసుకోవచ్చని స్పష్టం చేశారు. సివిల్ కేసులకు సంబంధించి కోర్టుకు కట్టిన ఫీజును తిరిగి తీసుకునే వెసులుబాటు ఉందని అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లలో క్రిమినల్, చెక్కు బౌన్స్, కుటుంబ తగాదా, బ్యాంక్ రికవరీ, ప్రామిసరీ నోటు, అన్ని రకాల సివిల్ కేసులతో పాటు ప్రీలిటిగేషన్ కేసులు, బ్యాంక్, టెలిఫోన్ బకాయి కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు.

జిల్లాలో 'గూడెం'ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి


జగన్నాథపురంలో మాట్లాడుతున్న సర్పంచ్ చంద్రిక

తాడేపల్లిగూడెం రూరల్: చెత్త రహిత మండలంగా తాడేపల్లిగూడెంను జిల్లాలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో ఎం.వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని జగన్నాథపురంలోని చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వెంకటేష్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేసే విధానాన్ని వివరించారు. సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాల మోడల్‌గా తయారు చేసేందుకు సిబ్బంది సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలి


లీడ్‌బ్యాంక్ మేనేజర్ ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

భీమవరం: కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను తక్షణమే ఇచ్చి స్కేల్ అప్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం కలెక్టరేట్‌లోని లీడ్ బ్యాంక్ మేనేజర్ పి ప్రేమ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దా రమేష్, ఉపాధ్యక్షుడు ఉండి వీరభద్రం మాట్లాడుతూ రూ.2 లక్షల వరకు వడ్డీ, హామీ లేని పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. నాలుగు శాతం వడ్డీతో రూ.5 లక్షల వరకు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైవీ ఆనంద్ మాట్లాడుతూ పంట సాగుదారు హక్కుల చట్టం 2010 పక్కాగా అమలు చేయాలని జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉన్న కౌలు రైతులకు మార్గదర్శకాలు అనుసరించి న్యాయం చేయాలని కోరారు. రుణాల కోసం వెళ్లిన కౌలు రైతులను భూ యజమాని షూరిటీ సంతకం పెట్టాలని, పంట రుణం తీసుకోకుండా ఉండాలని బ్యాంకర్లు ఆంక్షలు విధిస్తున్నారని లీడ్ బ్యాంక్ జోక్యం చేసుకోవాలన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలో కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లి సబ్ స్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఈఈ కే నరసింహమూర్తి తెలిపారు. కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట, మోదుగగుంట, ఉప్పరగూడెం, తాళ్లపాలెం, అప్పారావుపేట, గొల్లగూడెం, వెంకట్రావుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకులో

తణుకు అర్బన్: పైడిపర్రు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్స్ మరమ్మతులు, నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ డీఈ కె.నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పైడిపర్రు ఇండస్ట్రియల్ సర్వీసులు, మండపాక హౌసింగ్ కాలనీ, పైడిపర్రు హౌసింగ్ కాలనీ, మండపాక గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూలి రేట్లు పెంచాలని హమాలీల నిరసన


పెంచిన కూలి రేట్లు అమలు చేయాలని నినాదాలు చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సివిల్ సప్లయిస్ హమాలీలకు కూలి రేట్లు రూ.25 నుంచి రూ.28కు పెంపు, 14 నెలల ఎరియర్స్ చెల్లింపు జీఓ వెంటనే జారీ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సివిల్ సప్లయిస్ గోడౌన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరించాలని, కార్మికులకు ఉన్న రేట్లు చాలా తక్కువని అలాంటిది పెంచిన వాటిని అమలు చేయకపోవడం, జీఓలు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కి విజయవాడ ఆటోనగర్‌లో వినతిపత్రం అందజేశామని, ప్రభుత్వం వెంటనే హమాలీ కార్మికులు హామీలు అమలు చేయకపోతే ఉద్యమబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గార రంగారావు, ఎస్.చిన్నారావు, . కృష్ణారావు, రాము, నాయుడు, ధనరాజు, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

సరైన సస్యరక్షణ చర్యలతో దోమ నివారణ

పెంటపాడు: వరిలో నాట్లు వేసిన 65 నుంచి 70 రోజుల్లోపు వృద్ధి చెంది పంటపై దాడి చేసే దోమలపై రైతులు అప్రమత్తంగా ఉంటూ సస్యరక్షణ చర్యలు తప్పక చేపట్టాలని గుంటూరుకు చెందిన నకాస కంపెనీ ప్రతినిధులు శివగణేష్, కె. రాజు పేర్కొన్నారు. గురువారం బి. కొండేపాడులోని వెంకటసాయి ట్రేడర్స్ కార్యాలయ అవరణతో దోమల వల్ల పంటలకు కలిగే నష్టం- నివారణ మార్గాలను రైతులకు కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బోడపాడు, కొండేపాడు, రావిపాడులో దోమ ఉధృతి అధికంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. నకాసా కంపెనీ ద్వారా పై మెట్రిన్, తారాదీప్ ఎకరాకు 120 ఎంఎల్ పిచికారీ చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరశెట్టి రాంబాబు, పబ్బా రామారావు, రైతులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి


ఎలుకల బొరియలు మూస్తున్న కూలీలు

భీమవరం అర్బన్: పంట చేలల్లో ఎలుకలు వరి దుబ్బులను కొరికి చేనును నాశనం చేస్తాయని వాటిని సామూహికంగా మట్టుపెట్టాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రులో గురువారం పంట చేలల్లో ఎలుకల బొరియలు మూసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటి రోజు బొరియలు మూయడం వల్ల మరుసటి రోజు అవి బొరియలను తెరుస్తాయని వాటి వద్ద ఎలుకల మందు కలిపిన నూకల పొట్లాలను పెడితే వాటిని తిని మృతి చెందుతాయన్నారు.